# ప్రేమ

శ్రీమతి అమృతవల్లిగారు

పంకజం విద్యావతి సుగుణసంపత్తుకలది. అందమైనటువంటి యువతి. ఎం. ఏ. పరీక్షకు తయారగుచున్నది. ఆమె ఒకరోజు గదిలో కూర్చొని పరీక్షనుగురించి ఆలోచిస్తూన్న సమయంలో టెలిగ్రాఫి బంట్రోతు టెలిగ్రామ్, తీసుకొచ్చి ఇచ్చాడు. పంకజం హడావిడిగా విప్పిచూసింది. ఇంకేముంది, ఆమె గుండెలు నీరయిపోయినాయి. టెలిగ్రామ్ బల్లమీదపడేసి కర్తవ్యమేమిటాయని విచారించుచూ కుర్చీలో చతికిలపడింది. ఇంతలోకే కుముదం తలుపుతట్టింది. పంకజం కుముదయని గ్రహించికూడా అలాగే కూర్చొన్నది. ఏంచేస్తుందిపాపం, తలుపు తియ్యక తప్పిందికాదు. తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో, లోపలికి ఆహ్వానించింది.

కుముదం లోపలికి వచ్చీరాకముందే "నీకేమైనా మతిపోయిందా ఏమి? ఫోటోకి అంతా సిద్ధమయ్యారు. నీవు రాలేదని తెలుసుకొని, ప్రిన్సిపాల్, నిన్ను తీసుకు రమ్మని నన్ను పంపించాడు, వెంటనే రావాలిసిం"దని చెయ్యిపట్టుకొని లాగడం మొదలెట్టింది.

హీనస్వరంతో "రాలేను క్షమించు" అన్నది పంకజం. "ఏం! అట్లా ఉన్నావ్" అని అడిగింది కుముదం.

"ఆ! ఏమీలేదు." అంటూ తిరిగి నవ్వు ముఖంపెట్టి కులాసాగానే ఉన్నాను" అన్నది.

"ఈ ఖబుర్లన్నీ తీసి అవతలపెట్టుదూ నే నమ్మనులే నిజమైనసంగతేమిటో చెప్పు మనమిద్దరం చిన్నప్పటినుంచి స్నేహంగా ఉన్నామ్ ప్రతియేడు తప్పకుండా ఎం. ఏ. వరకు వచ్చాం. నన్ను నమ్మవా? మిత్రద్రోహం చెయ్యకు" అంటూ బ్రతిమాలటం మొదలెట్టింది.

"ఏం, లేదు పరీక్షకు వెళ్లదలచుకోలేదు. అందువల్ల ఫోటోకి రాను" అన్నది పంకజం.

"క్లాసులోకల్లా 1st class లో pass అవుతావని అందరం అనుకుంటూంటే పరీక్షకు వెళ్లనంటావే బాగుంది. పిచ్చిపిచ్చివేషాలు పోవాకు, లేచిరా" అన్నది.

"నీకు తెలీదు, వెళ్లు. ఫోటో మించిపోతుంది. ముమ్మాటికి రా"నని చెప్పింది.

కుముదానికి ఈ గొడవంతాచూస్తే ఏమీ అర్థంకాలేదు. ఏం చేస్తుందిపాపం. పరిపరివిధాలపోయింది మనస్సు. పరిస్థితులన్నీ ఆలోచించింది. ఈమె ఈవిధంగా ఉండటానికి, పరీక్షకు పోకుండాఉండటానికి, ఎంత ఆలోచించినా కారణం తోచకుండా ఉంది.

ఎన్నివిధాల ఆమెచేత కారణం చెప్పిద్దామన్నా చాతకాకపోయింది.

ఇట్లా రెండురోజులు గడిచాక, మూడో రోజున కుముదం కన్నీరుకారుస్తూ, హీన స్వరంతో "మనస్నేహం ఇంతేకాదూ, చెప్పవుకాదూ!" అంటూ పంకజం గదిలోకి వచ్చింది. పంకజంకు ఇహ చెప్పకతప్పింది కాదు. ఎవరితోకూడా చెప్పనని ఒట్టు వేయించుకొని, తనచెల్లెలుదగ్గరనుంచివచ్చిన టెలిగ్రామ్ చేతికిచ్చింది.

టెలిగ్రామ్ చాలా విషాదకరమైంది. దాంట్లో, పంకజం బావగారైన కృష్ణారావుకు, రాచకురుపు లేచినదనిన్నీ, ఆపరేషన్ చేసినగాని బ్రతుకడనిన్నీ, ఆపరేషనుకు కావలసినంత డబ్బు తనవద్ద లేదనిన్నీ, తను పంకజానికి చదువుకు సహాయము చేయలేకపోగా, తిరిగి సహాయమడుగుటకు చింతిల్లుచున్నాననియు, కనీసము నూట ఏబదిరూపాయలైన సహాయముచేసి, భర్తను బ్రతికింప వేడుచున్నాననియు వ్రాసియుండెను.

పంకజం, ఇన్నిరోజులనుంచి జాగ్రత్తగ పరీక్షకు దాచినసొమ్ము, నూరురూపాయలు. Pass book కూడ కుముదానికి చూపించింది. ఇదా సంగతన్నది. కుముదం పరిస్థితులు అర్థంచేసుకొని తన స్నేహితురాలికి, ఇన్ని కష్టములు వచ్చినందుకు చింతించుచూ, "సరే వస్తానని" వెళ్లిపోయింది.

తనగదికి వెళ్లిందగ్గరనుంచి, ఆమెకు ఏం తోచిందికాదు. పంకజాన్ని ఈక్లిష్టపరిస్థితులలోనించి తప్పించటం ఎలాగా యని ఆలోచించటం మొదలెట్టింది. ఏం తోచిందికాదు. చివరకు తనమేనమామకొడుకు శ్యామసుందరందగ్గరకు వెళ్లటానికి నిశ్చయించింది.

శ్యామసుందరం, సుందరపురుషుడు అపారమైన బుద్ధికుశలత కలవాడు. నవనాగరికుడు M. A. pass అయి ఉత్తరోత్తర పెద్ద నౌకరీలోకి రావచ్చుననే ఉద్దేశముతో, బ్యాంకు లో గుమాస్తాగా పని చేయుచున్నాడు. అతనికివచ్చే పదిరాళ్లూ, కులాసాగా ఖర్చుపెడుతూ కాలం గడుపుచున్నాడు.

ఆరోజు శెలవుదినం అగుటవల్ల కూనిరాగాలుతీస్తూ, పడకకుర్చీలో పడుకొని, అతనికి రేపు బ్యాంకుఇచ్చే బోనసును, ఎట్లా ఖర్చుపెడదామా యనికాబోలు, ఆలోచిస్తుండగా ఇంతలోకే కుముదం హాజరైంది.

"ఏమోయి బావా! ఎప్పుడుచూసినా, శతమన్మథుడులా గుంటావ్."

"నీకంటికట్లాగే అవపడతా మరి." కులాసాగానే. రేపటిరోజుగురించి ఆలోచించే వాణ్ణికాను. దిగులు విచారం అనేది నామనస్సుకెక్కదు. ఏదో జరిపేస్తుంటాను రోజులు."

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఏముంది. రేపు బ్యాంకువాళ్లు ఇచ్చే బోనసు ఎట్లా ఖర్చుపెడదామని."

"ఏం కొంటావ్?

"ఒక వీణకొని కులాసాగా వెన్నెలరాత్రిళ్లల్లో మేడమీద వాయించుకుంటూ ఆనందిద్దామని"

"అయితే పెళ్లిమాట ఆలోచించటం లేదు?

"పెళ్లెందుకమ్మా? భార్యవచ్చిందగ్గర నుంచి ఇంట్లో ఉప్పులేదు, పప్పులేదు, నగలు లేవు, నాణ్యాలులేవు అంటూ పోట్లాటేగా. ఇదయితే ఆ గొడవంతా ఏమీ ఉండదుగా."

"సరే లేద్దూ ఈ ఖబుర్లకేం తప్పక కొనాల్సిందే?"

ఇట్లా మాట్లాడుతుండంగానే కుముదం ముఖంలో మార్పు సుందరం గమనించాడు.

"ఏం! నిమిషంలో మారిపోయ్యావ్"

"ఏంలేదు! ఏంలేదు!" అంటూ కులాసాగా అవపడటానికి ప్రయత్నం చేసింది.

ఏదోకష్టంలో ఉన్నట్టుగ్రహించి, సుందరం చెప్పేదాకా వదలిపెట్టలేదు.

చెప్పక తప్పిందికాదు, కుముదానికి; ఉన్న విషయం అంతా పంకజంను ఇదివరలో కలుసుకొని మాట్లాడిన సంగతులన్నీ అతని జ్ఞాపకంరావటం మొదలెట్టినాయి. మొట్టమొదట పంకజం బ్యాంకుకు రావటంపోవటం చూచాడు. తర్వాత కుముదంతో వచ్చినప్పుడు పరిచయం అయింది. అప్పటినుంచి ఏదోవిధంగా మాట్లాట్టం మొదలెట్టాడు. పరిచయం జాస్తిఅయినకొద్దీ బుద్ధికూడా మారిపోయింది. తనప్రేమను ఆమెకు వెలిబుచ్చాలని చాలా ప్రయత్నాలుచేశాడు. ఒకరోజున ఆమె బ్యాంకుకు వచ్చినప్పుడు, Pass bookతోపాటు ఒక ఉత్తరాన్నికూడా ఇచ్చాడు. పంకజం ఇంటికొచ్చి ఉత్తరం చూసి, నవ్వుకొని చింపి పోస్టులో మళ్లీ పంపించింది. సుందరం చించిన ఉత్తరంచూచి నిర్ఘాంతపొయ్యాడు. అప్పటినుంచీ ఏంచెయ్యటానికీ తోచలేదు. సరే సమయంవచ్చింది కదాయని సహాయం చేయుటానికినిశ్చయించి తనపేరటఉన్న బోనసు నామె ఎకౌంటుకు transfer చేశాడు.

మరుసటిరోజునుంచీ పరిస్థితులు ఎట్లా మారుతాయో చూదామని శలవు తీసుకొన్నాడు.

సుందరానికి ఎట్లాయితే ఉద్దేశంఉందో పంకజానికికూడా, సుందరంమీద మనస్సుంది. చదువు పూర్తికాలేదనే ఉద్దేశంతో చనువీయలేదు. చింపినఉత్తరం పంపినదగ్గరనుంచి సుందరం ఏమనుకుంటాడోయని భయపడుతూ ఉన్నది. తనచెల్లెలకు బ్యాంకులో ఉన్న డబ్బయినా పంపిద్దామని బ్యాంకుకు వెళ్లింది. అక్కడ మామూలుగా ఇచ్చే సుందరం లేడు. మరీ మంచిదికదా అనుకొని కొత్తగుమాస్తా దగ్గరకెళ్ళి తన ఎకౌంటులో నూరురూపాయలున్నవి. ఆమొత్తంఅంతా ఇవ్వవలసిందని కోరింది.

గుమాస్తా ఎకౌంటుచూచి ఆశ్చర్యంతో ఎగాదిగాచూచి నూరురూపాయలుకాదు.

రెండువందల రూపాయలున్నాయి" అని చెప్పి డబ్బుఇచ్చేశాడు.

ఆమిగతా నూరురూపాయలు ఎవరు వేశారు? ఏమిటని? ఆశ్చర్యంగా అడిగింది.

ఆవిషయం నాకేమీ తెలీదు. బ్యాంకు లో డబ్బువేశేవాళ్లువస్తే వారిని ఈవిష యాలు ఏమీ అడగం. ఇచ్చేటప్పుడుమట్టుకు తెలుసుకుంటామ్, అదీసంగతీ తీసికెళ్ళ మన్నాడు.

కాశేపు పస్తాయించి, బాగానే ఉందను కొని ఎవరువేశింది తెలుసుకోలేక ప్రస్తుతం పని గడుస్తుందిగదా అసిన్నీ, తర్వాత ఎవరు వేశిందీ తెలిస్తే వారికి అప్పు తీర్చొచ్చు గదాయని డబ్బుతీసుకొని చెల్లెలకు కావల సిందిపంపి మిగదాతీసి పరీక్షరుసుము కట్టింది.

జరిగిన వృత్తాంతమంతా పంకజం, కుము దంతోటి పూసగ్రుచ్చినట్లు చెప్పింది. సంగతు లన్నీ ఇదివరలోనే తెలిసిందికనక చిరునవ్వు నవ్వింది.

కొన్నాళ్లుపోయాక కుముదం శ్యామ సుందరం గదికివెళ్ళి "పీణకొన్నావా? కొంచం వినిపించు?" అని ఎగతాళిగా మాట్లాడటం మొదలెట్టింది.

సుందరం సిగ్గుపడి తలవంచుకొన్నాడు.

కుముదం అతని పాస్‌బుక్కుతీసి, "నీబోనస్సు ఏంచేశావో నాకు తెలుసులే" అన్నది.

సుందరం నవ్వాడు.

కుముదం, పంకజం 1st class లో pass అయ్యారని results తెలిశాయి.

కుముదం పంకజంతో అన్నివిషయాలు చెప్పింది.

పంకజం సుందరాన్ని క్షమించమని కోరింది

క్షమించటానికన్నా మీరు భార్యాభర్తలయితే బాగుంటుందన్నది, కుముదం.

పంకజం, సుందరం ఒకర్నిఒకరు తెలుసు కున్నవారగుటచేత కుముదం కోరికప్రకారం మరునాడునుంచి భార్యాభర్తలై కులాసాగా కాలంగడపటం సాధించారు.